క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న నవాజీపూర్‌వాసులు

శంషాబాద్ రూరల్: నవాజీపూర్‌లో ఏర్పాటు చేయనున్న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణకు నిర్వాకులు మంగళవారం ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ను ఆహ్వానించారు. ఈనెల 18న గ్రామంలో విగ్రహావిష్కరణ చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. పాపన్న విగ్రహం ఏర్పాటుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు పి.రమేష్‌గౌడ్, అధ్యక్షుడు బి.నారాయణగౌడ్, ఉపాధ్యక్షుడు పి.జనార్దన్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పి.అంజయ్యగౌడ్, నాయకులు సింహారెడ్డి, పి.వెంకన్నగౌడ్, రామచంద్రయ్యగౌడ్ పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణల తొలగింపు



మణికొండ: చెరువు బఫర్, ఎఫ్‌టీఎల్‌లో పరిధిలో ఏర్పాటు చేసిన లేబర్ క్యాంప్‌ను హైడ్రా అధికారులు మంగళవారం కూల్చివేశారు. మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ చిన్న చెరువు పక్కనే పూజ క్రాఫ్టెడ్ హోమ్స్ నిర్మాణ సంస్థ ఓ గేటెడ్ కమ్యూనిటీని నిర్మిస్తుంది. అందులో పనిచేస్తున్న కార్మికులకు పక్కనే ఉన్న చెరువు బఫర్, ఎఫ్‌టీఎల్‌లో రేకులతో షెడ్‌లను ఏర్పాటు చేశారు. దాదాపు రెండున్నర ఎకరాలలో మట్టిని నింపి లేబర్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. గతంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వాటిని పరిశీలించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. అయినా వారు ఎలాంటి చర్యలు చేపట్టకపోవటంతో మంగళవారం జేసీబీలతో వాటిని పూర్తిగా తొలగించారు. అక్కడితో ఆగకుండా చెరువు స్థలంలో నింపిన మట్టిని తొలగించి నిర్మాణ సంస్థ స్థలంలో వేశారు. సదరు నిర్మాణ సంస్థపై ఇరిగేషన్ అధికారులు నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని చెత్తను రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో వేయొద్దని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. 100 రోజుల ప్రణాళిక 'ఒక మార్పు అభివృద్ధికి మలుపు' కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 17వ డివిజన్‌లోని సూర్యోదయ కాలనీలో తడి, పొడి, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



యాంటి ర్యాగింగ్ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది


ఏజీవర్సిటీ: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ ప్రశాంత్ అన్నారు. శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో యాంటీ ర్యాగింగ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 12 నుంచి 18వ తేదీ వరకు విద్యార్థులకు యాంటి ర్యాగింగ్‌పై చైతన్యం తీసుకురావడానికి వివిధ అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఎలాంటి ర్యాగింగ్‌కు అవకాశం లేకుండా అన్ని చర్యలను చేపట్టామన్నారు. విశ్వవిద్యాలయానికి రాబోవు నూతన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బోధన సిబ్బంది తోపాటు విద్యార్థులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ వారం రోజులు విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం, వ్యాసరచన, డిబెట్ పోటీలను నిర్వహిస్తామని గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కళాధర్‌బాబు, మానస, లావణ్య, డాక్టర్ జెన్ని, శ్రీరాములు, అశోక్, శ్రీనాథ్ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అందాల ఈసీ.. ఆనందంగా చూసి..



బండ్లగూడ జాగీర్ ఈసీ నది చెక్ డ్యాం వద్ద..

- కనువిందు చేస్తున్న వరద ప్రవాహం
- ప్రవాహాన్ని చూసేందుకు వస్తున్న సందర్శకులు
- చెక్‌డ్యాం వద్ద ప్రమాదకరంగా చేపల వేట



ఔటర్ సబ్ రోడ్డుపై నుంచి వరద ప్రవాహం ఇలా..


బండ్లగూడ: ఎగువ ప్రాంతాలైనా దోసాడ, పామెనా, ఎర్రవల్లి, చేవెళ్ల, తాళ్లపల్లి, నాగర్‌గూడ, వెంకటాపూర్, అమ్డాపూర్ తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు హిమాయత్‌సాగర్ లోకి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతుంది. ఐదు క్రస్టుగేట్లను సోమవారం రాత్రి సమయంలో ఎత్తడంతో ఔటర్ సబ్ రోడ్డుపై నుంచి వరద ప్రవాహం భారీగా ప్రవహిస్తోంది. దీంతో మరోమారు పూర్తిగా సబ్ రోడ్డుపై రాకపోకలను నిలిపివేసిన రాజేంద్రనగర్ ట్రాఫిక్ అధికారులు. బండ్లగూడ జాగీర్ ఈసీ నదిలో ఏర్పాటు చేసిన చెక్ డ్యాం నుంచి ప్రవహిస్తున్న జల దృశ్యాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వాటిని తిలకించేందుకు జనాలు భారీగా అక్కడికి వస్తున్నారు.

మొసళ్లు ఉన్నాయి జాగ్రత్త..

ఇటీవల వర్షాలు కురుస్తుండటంతో ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు రావడంతో ఈసీ పరీవాహక ప్రాంతమైన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిస్మత్‌పూర్ తదితర ప్రాంతాల్లో ప్రజలు సరదాగా చెరువులో స్నానాలు చేస్తూ, చేపల వేట కొనసాగిస్తున్నారు. ఈసీ నదిల్లోకి వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలి అక్కడి ప్రాంతంలో మొసళ్లు తిరుగుతున్నాయి. గతంలో చేపల కోసమని గాలం వేస్తే రెండు మొసళ్లు వచ్చిగాలానికి చిక్కుకున్నాయి. ఈ మొసళ్లు హిమాయత్‌సాగర్ గేట్లు ఎత్తివేత సమయంలో ఈసీ నదిలోకి వచ్చి ఉంటాయని అటవీ శాఖ అధికారులు గతంలో భావిస్తున్నట్లు తెలిపారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి..

గతంలో కార్పొరేషన్ పరిధి ఈసీ పరీవాహక ప్రాంతాల్లో అధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు పాడైపోయాయి. ప్రస్తుతం అక్కడ సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



బండ్లగూడ జాగీర్ చెక్‌డ్యాం వద్ద చేపల వేట



తాళ్లపల్లి వాగుపై చెక్ డ్యాం వద్ద..

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



శ్రీనివాస్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేస్తున్న పోలీసులు

మణికొండ: బంజారాహిల్స్ పెద్దమ్మ గుడిలో ఓ అమ్మవారి ఆలయాన్ని హైడ్రా కూల్చటంతో అక్కడ మంగళవారం కుంకుమార్చన చేయాలనుకున్న బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టులు చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్. ఇందిర ఆధ్వర్యంలో పలువురు నాయకులను రాయదుర్గం పోలీసులు అరెస్టు చేశారు. వారిని స్టేషన్‌కు తరలించి మధ్యాహ్నం వదిలిపెట్టారు. ఇందిర మాట్లాడుతూ..చెరువులు, కుంటలలో ఉన్న ఇతర మతాలకు చెందిన కళాశాలలు, ఆలయాల జోలికి వెళ్లని ప్రభుత్వం కేవలం హిందువుల ఆలయాలనే కూల్చటం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు.

ఆలయాలపై దాడులు హేయమైన చర్య..

మైలార్‌దేవ్‌పల్లి: ఆలయాలపై జరుగుతున్న దాడులు హేయమైన చర్య అని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీజేపీ నాయకులతో కలిసి చలో బంజారాహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయానికి బయలుదేరే క్రమంలో పోలీసులు ఆయనను హౌస్ అరెస్టు చేశారు. ఆయన మాట్లాడుతూ..అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో పోలీసులు ఇలా దౌర్జన్యంగా బీజేపీ నాయకులను అడ్డుకొని హౌస్ అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు.



ఇందిరను హౌస్ అరెస్టు చేసిన రాయదుర్గం పోలీసులు

డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని వినతి



జలమండలి మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అడికే రాజు తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్తూ వాటికి శాశ్వత పరిష్కారం జరిగేలా కృషి చేస్తున్నామని లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అడికే రాజు అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు పూర్తి చేయాలని రాజేంద్రనగర్ జలమండలి జనరల్ మేనేజర్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు స్పందించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు హనుమాన్లు, ప్రకాష్ రావు, రవీందర్ తదితరులున్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రిల్స్ ఏర్పాటు

రాజేంద్రనగర్: కాంగ్రెస్ పార్టీ నాయకుడు వర్రీ లలిత్ రూ.లక్షతో రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల తరగతి గదులతో పాటు కిటికీలు, ప్రధాన ద్వారానికి ఈ గ్రిల్స్‌ను ఏర్పాటు చేయించారు. మంగళవారం పనులు పూర్తి కావడంతో ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తరగతి గదుల్లో విలువైన కంప్యూటర్లు, ఇతర సామగ్రి ఉందని వీటికి భద్రత కరువైందనే విషయాన్ని తన దృష్టికి తీసుకురావడంతో గ్రిల్స్‌ను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉమామహేశ్వరి, నయీం, సంజీవ, శ్రీకాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.



గ్రీల్స్ పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు వర్రీ లలిత్ తదితరులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



కాటేదాన్ చౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు జి.ఎం.కురుమయ్య అధ్యక్షతన ఐక్య పోరాటమే శరణ్యంలో భాగంగా కాటేదాన్ చౌరస్తాలో రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. రుద్రకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొంత వరకు సర్వే చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించడం మంచి పరిణామం అన్నారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్ష పార్టీలన్నీ కలుపుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు జి.ఎం.కురుమయ్య, భాస్కర్, బి.వెంకటయ్య, ఆంజనేయులు, రాములు, ప్రవీణ్, సచిన్, దత్తు, శశికాంత్, గోపాల్, పాపిరెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను మంగళవారం ఉదయం రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి సందర్శించారు. సాధారణ పరిశీలనలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. ఈవీఎం గోడౌన్‌కు వెళ్లి సీళ్లను పరిశీలించి, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. అనంతరం రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పర్యవేక్షించి పలు సూచనలు, జాగ్రత్తలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజన్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, తహసీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జి రాములు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



రాజేంద్రనగర్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ బుద్వేల్ రజక బస్తీలో పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టాలని స్థానికులు రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరుతున్నారు. ఐదు దశాబ్దాలుగా రజక బస్తీలో ఓంకార భజన మండలి ఆధ్వర్యంలో జెండావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదట నాటి సర్పంచ్‌లు, అనంతరం కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, కార్పొరేటర్లు ఈ జెండావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. బస్తీలోని జెండా దిమ్మె వద్ద చెత్తాచెదారం పేరుకుపోయాయన్నారు. ప్రస్తుతం జెండా ఎగురవేసేందుకు వీలు లేకుండా ఉందని వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ విషయాన్ని గమనించి పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం



రాజేంద్రనగర్‌లో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని లైబ్రరీలో మంగళవారం గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకుడు వర్రీ లలిత్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..విద్యార్థులు ప్రతిరోజూ తప్పనిసరిగా గ్రంథాలయాని సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో పచ్చ శ్రీనివాస్, ఉమామహేశ్వరి, నయీం, గౌడుగు సంజీవ, పతియర నరసింహా, రాధాకృష్ణ, రాజేంద్రనగర్ విలేజ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ ముదుమాల, చెరుకుల రవి, శంకర్, నిఖిల్, గడ్డం శివలింగం, సందీప్, మనోహర్ పాల్గొన్నారు.

జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో..

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మంగళవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీన్ అఫ్ అగ్రికల్చర్ డాక్టర్ ఝాన్సి మాట్లాడుతూ..గ్రంథాలయ సేవలను విద్యార్థులంతా విరివిగా వినియోగించుకోవాలని సూచించారు. డాక్టర్ బలరాం, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ ఈశ్వరి, డాక్టర్ శశికళ, విద్యార్థులు పాల్గొన్నారు.

సీబీఐటీలో యాంటీ ర్యాగింగ్ డే

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కళాశాలలో మంగళవారం ర్యాగింగ్ వ్యతిరేక దినోత్సవాన్ని జరుపుకున్నారు. అందులో భాగంగా ర్యాగింగ్ వలన కలిగే అనర్థాలు, చట్టపరమైన, నైతిక, భావోద్వేగపరమైన ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యూజీసీ యాంటీ ర్యాగింగ్ నియమాళిని పఠింపచేసి పరస్పర గౌరవం, స్నేహభావాన్ని కాపాడాతామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. మంగళవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు యాంటీ ర్యాగింగ్ వారాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, వైస్ ప్రిన్సిపాల్ అడామిక్స్ కె. కృష్ణవేణి, ఎన్‌ఎస్‌ఎస్ ఇంచార్జి డాక్టర్ శ్రీధర్, ప్రొఫెసర్ లింగారెడ్డిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రమాణం చేయించిన అధ్యాపకులు

ఇళ్లు కూలిన వారిని ఆదుకోవాలి

మణికొండ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పుప్పాలగూడలోని శివాలయం ప్రహరీ కూలి నాలుగు ఇళ్లు నేలమట్టం అయ్యాయని, వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. మంగళవారం మణికొండ మున్సిపల్ మేనేజర్‌కు బీఆర్‌ఎస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆలయ ప్రహరీ మరింత కుంగిపోయి ఉందని, దాన్ని ముందుగానే తొలగించాలన్నారు. లేదంటే రాబోయే రోజుల్లో మరిన్ని ఇళ్లపై కూలే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. ఉపేంద్రనాథ్‌రెడ్డి, బాబురావు, మల్లేష్, శ్రీకాంత్, కిరణ్, షేక్ ఆరీఫ్, సుమనళిని పాల్గొన్నారు.



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు

ట్రాఫిక్ దారి మళ్లింపు

- హిమాయత్‌సాగర్ నుంచి ఉధృతంగా పారుతున్న వరద
- వరద పరిస్థితిని పరిశీలించిన ఏసీపీ బాలాజీ
- వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని సూచన

రాజేంద్రనగర్: ఔటర్ రింగ్ రోడ్డు సర్వీసు రోడ్డు గుండా హిమాయత్‌సాగర్ వరదనీరు పారుతుండటంతో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ ఎ.బాలాజీ వెల్లడించారు. సన్‌సిటీ మూసి బ్రిడ్జితో పాటు సర్వీసు రోడ్డు బ్రిడ్జిని పూర్తిగా మూసివేసినట్లు వెల్లడించారు. వరద పరిస్థితిని మంగళవారం ఆయన రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజుతో కలిసి పరిశీలించారు. సన్‌సిటీ, పీ అండ్ టీ కాలనీ ప్రాంతంలోని మూసీ కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఇరువైపుల రోడ్డులో జన చైతన్య వెంచర్, పీ అండ్ టీ కాలనీ ప్రాంతాల్లో తాత్కాలికంగా పోలీసు పికెటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ దారి గుండా వెళ్లే వాహనదారులు, పాదచారులు ప్రత్యామ్నాయంగా కిస్మత్‌పూర్ నుంచి లేదా బాపూఘట్ బ్రిడ్జి వద్ద నుంచి రాకపోకలు సాగించాలన్నారు. ప్రస్తుతం వరద ప్రమాద స్థితిలో పారుతుందని..ఈ విషయాన్ని వాహనదారులు, ప్రజలు గమనించాలన్నారు. హిమాయత్‌సాగర్ సర్వీసు రోడ్డుపై నుంచి వరదనీరు ప్రవహిస్తున్న నేపథ్యంలో రోడ్డును పూర్తిగా మూసివేశామన్నారు. సర్వీసు రోడ్డు ఎగ్జిట్ 17 వద్ద, లార్స్ కళాశాల చౌరస్తా వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి మూసివేశామన్నారు. శంషాబాద్‌తో పాటు రాజేంద్రనగర్ నుంచి వచ్చే వాహనదారులు బుద్వేల్ కిష్టమ్మ గుట్ట, కిస్మత్‌పూర్, బండ్లగూడ మీదుగా రాకపోకలను సాగించాలన్నారు. నగర శివార్లతో పాటు బండ్లగూడ, నార్సింగి నుంచి రాజేంద్రనగర్‌కు వచ్చే వాహనదారులు సైతం ఇదే రోడ్డును ఉపయోగించాలని సూచించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ ఉంటుందని..ట్రాఫిక్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. వరదనీరు తగ్గుముఖం పట్టిన వెంటనే పీఅండ్‌టీ కాలనీ, హిమాయత్‌సాగర్ సర్వీస్ రోడ్లను పరిశీలించి పునఃప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం బుద్వేల్, కిస్మత్‌పూర్, బండ్లగూడ ప్రధాన రహదారులపై స్థానికులు తమ వాహనాలను పార్కు చేయొద్దని సూచించారు.



లార్స్ కళాశాల వద్ద రోడ్డును మూసివేసి బందోబస్తును నిర్వహిస్తున్న పోలీసులు



పీ అండ్ టీ కాలనీ వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ